సేవా సంస్థలను ప్రోత్సహించాలి

లిబర్టీ: నిరుపేదల స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న సంస్థలను ప్రోత్సహించాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ కోరారు. ఈమేరకు కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రాందాస్ అథువాలేకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. సామాజిక సాహిత్య, సాంస్కృతిక విద్య, వైద్య విషయమై పేదలకు చేయూతనివ్వడంతో పాటు జాతీయస్థాయి పర్వదినాలు సాహిత్య సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు సాహిత్య సభలు సెమినార్లు నిర్వహించాలని మంత్రి సూచించారని ఆయన తెలిపారు.

పీజేఏసీ స్టీరింగ్ కమిటీ ఏకగ్రీవం

హిమాయత్‌నగర్ : పొలిటిషియన్ జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం దేశోద్ధారక భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పొలిటిషియన్ జేఏసీ జాతీయ కన్వీనర్‌గా గిద్ద శ్రీనివాస్ నాయుడును, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్ ఇంద్రపల్లిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జేఏసీ బలోపేతానికి, భవిష్యత్ కార్యాచరణపై సభ్యులు చర్చించారు.

'చట్టపరంగా బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలి'

హిమాయత్‌నగర్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పార్టీపరంగా కాకుండా చట్టపరంగా ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో బీహార్, జార్ఖండ్, తమిళనాడు ప్రభుత్వాలు అనుసరించిన విధానం ఇక్కడి ప్రభుత్వం ఎందుకు అవలంభించడం లేదన్నారు. రిజర్వేషన్లు అమలుకు అనేక ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని తెలిపారు. గవర్నర్‌తో ఆర్డినెన్స్ ఆమోదింపజేసి జీఓ జారీ చేయాలన్నారు. లేకుంటే అసెంబ్లీలో బీసీ బిల్లు మళ్లీ పాస్ చేసి గవర్నర్‌కు పంపితే తప్పనిసరి పరిస్థితుల్లో ఆమోదం లభిస్తుందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు చట్ట ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద సోమవారం తలపెట్టిన సత్యాగ్రహ దీక్షకు అన్ని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. బీసీ నేతలు గుజ్జ సత్యం, జిల్లపల్లి అంజి, నిఖిల్, మోదీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం హర్షణీయం

అబిడ్స్: గణేష్ మండపాలతో పాటు దుర్గామాత మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అంగీకరించిందని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ వెల్లడించారు. తమ ఉత్సవ సమితి డిమాండ్ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గణేష్ మండపాలు, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఆదేశించడం హర్షణీయమన్నారు. టీజీఎస్‌పీడీసీఎల్ విద్యుత్‌శాఖ అధికారులు ముఖ్యమంత్రి ఆదేశంతో చట్టపరంగా ఆదేశాలు జారీ చేశారని ఆయన అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి తరఫున ధన్యవాదాలు తెలిపారు. గ్రేటర్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు అందరూ స్థానికంగా మండపాలకు ఉచిత విద్యుత్ పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'అయ్యప్ప భక్తులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి'

గన్‌ఫౌండ్రీ: అయ్యప్ప భక్తులపై జరుగుతున్న దాడులను రెండు రాష్ట్రాల భక్తులు అరికట్టాలని అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ సభ్యులు డాక్టర్ బి.ఈశ్వరయ్య గురుస్వామి కోరారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ కార్యాలయంలో నాలుగు రాష్ట్రాల సభ్యుల సమావేశం, కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అయ్యప్ప సేవలో ముందుండే వారిని ఒక తాటిపైకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని, జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి ముందుకు సాగుతామని వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల నుంచి అయ్యప్ప భక్తులు 50 శాతం వరకు శబరిమలకు వెళ్తున్నారని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రాల భక్తులకు పూర్తిగా అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఆది మోహన్‌రెడ్డి, రుద్ర కోటేశ్వర్‌రావు, రాజేష్ గౌడ్, సర్కు సిద్దు, డాక్టర్ బాలు, అనంతరావు, వైకుంఠం పాల్గొన్నారు.

దాశరథి రంగాచార్యకు ఘన నివాళి

గన్‌ఫౌండ్రీ: దాశరథి రంగాచార్య నవలలు చారిత్రకమైన సంపద అని ప్రముఖ కవి డాక్టర్ సింకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్ర భారతిలో తెలంగాణ సాహిత్య అకాడమి, తెలుగు భాషా, చైతన్య సమితి సంయుక్తాధ్వర్యంలో డాక్టర్ దాశరథి రంగాచార్య 9వ జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ..దాశరథి రంగాచార్య సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. ప్రస్తుత యువత ఆయన పుస్తకాలను చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. కుసుమ ధర్మన్న కళాపీఠం చైర్‌పర్సన్ డాక్టర్ రాధాకుసుమ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం..!



ఇంటింటికీ మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

కాచిగూడ: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కాలనీలు, బస్తీల నేతలు, విద్యార్థులు, పాఠశాలల్లో పర్యావరణ ప్రేమికులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. కాలుష్య కారక రంగులు, పదార్థాలతో తయారయ్యే విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేస్తే చెరువంతా కాలుష్య కాసారంగా మారే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా తాము మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి

బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పురలో మట్టి విగ్రహాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటింటికీ మట్టి విగ్రహాల పంపిణీ..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించాలని ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి కేశబోయిన శ్రీధర్ కోరారు. మట్టి గణపతి తయారీ, వాటి వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు ఆదివారం మట్టి గణపతి విగ్రహాలను ఆయన ఇంటింటికీ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు.

దేశంలోనే భాగ్యనగర్ గణేశ్ ఉత్సవాలకు ప్రత్యేక స్థానం...

భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎస్.గౌతంరావు కోరారు. ఆదివారం బర్కత్‌పురలో గణపతి విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలోనే భాగ్యనగర్ గణేశ్ ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ ఉత్సవ సమితి నిర్వహాకాకులకు సహకరించాలని కోరారు. నగరంలో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో రామంతాపూర్‌లో ఆరుగురు, అంబర్‌పేటలో ఒకరు, బండ్లగూడలో ఇద్దరు చనిపోవడం బాధాకరమని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు మానుకుని విద్యుత్ ప్రమాదాలు జరగకుండా యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకోవాలన్నారర్ధీ కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి, నాయకులు రమేష్‌యాదవ్, సూర్యప్రకాష్ సింగ్, శీర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



బర్కత్‌పురాలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న బీజేపీ సీనియర్ నేత డాక్టర్ ఎస్.గౌతంరావు



ఇంటింటికీ పర్యావరణ గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కేశబోయిన శ్రీధర్



సుందరయ్య పార్కులో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న హైదరాబాద్ జిందాబాద్ నాయకులు

సుందరయ్య పార్కులో విగ్రహాల పంపిణీ..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ సుందరయ్య పార్కు, హైదరాబాద్ జిందాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య పార్కులో మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ... పర్యావరణాన్ని పరిరక్షించడానికి మట్టి విగ్రహాలు దోహదం చేస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తశ్రద్ధలతో పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిందాబాద్ కె.వీరయ్య, శ్రీనివాసరావు, నగేష్, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, మాజీ ఏవీపీ సంపత్‌రెడ్డి, లింగ ప్రకాష్, ఎస్.రమేష్‌రెడ్డి, కోశాధికారి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

కాచిగూడ: స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా కాదు చట్టపరంగా రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చట్టబద్ధంగా స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఈనెల 25వ తేదీన సోమవారం ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణలో బీసీలకు చట్టపరంగా రిజర్వేషన్లు కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. బీసీలను విస్మరిస్తే తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీలం వెంకటేష్, వేముల రామకృష్ణ, చెరుకు మణికంఠ, అనంతయ్య, వాణి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతోంది'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశ సార్వభౌమత్వాన్ని మోదీ ప్రభుత్వం అమెరికాకు తాకట్టు పెడుతోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ... అమెరికా విధిస్తున్న సుంకాలు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయని అన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని ట్రంప్ అగౌరవపరుస్తుంటే ప్రధాని మోదీ ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. భారత వస్తువులపై 25 శాతం సుంకాలు, 25 శాతం జరిమానా విధిస్తామని ట్రంప్ చెప్పడం ఎంతవరకు సమంజసమని అన్నారు. అమెరికా అధిపత్యాన్ని ప్రపంచ దేశాలు ప్రశ్నిస్తుంటే దేశ పాలకులు ఎందుకు మాట్లాడటం లేదన్నారు. దేశ అంతరంగిక వ్యవహారాల్లో మోదీ జోక్యం పెరిగిపోతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ కార్యదర్శి ఎం.అడివయ్య, జనని ఫౌండేషన్ చైర్మన్ టి. అనురాధ, ఆర్. ప్రశాంత్, ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షుడు కె.వెంకట్, కోశాధికారి ఆర్.వెంకటేష్, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

అసైన్డ్ భూములకు యాజమాన్యపు హక్కులు కల్పించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 1977 పీఓటీ చట్టాన్ని రద్దు చేసి అసైన్డ్ భూములు కలిగిన వారికి యాజమాన్యపు హక్కులు కల్పించాలని తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసైన్డ్ భూములతో సమాన హక్కులు కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 20 లక్షల అసైన్డ్ భూములు దాదాపు 16 లక్షల కుటుంబాలకు సంబంధించిన భూములు ఉన్నాయని తెలిపారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు అప్పటి ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ, ఓసీ అన్ని కులాల పేదరికం ఆధారంగా నిరుపేద కుటుంబాలకు భూములు పంపిణీ చేశారని తెలిపారు.

◆ పేదలకు సంబంధించిన అసైన్డ్ భూములకు భద్రత కల్పిస్తామంటూ 1977 సంవత్సరంలో అసైన్డ్ భూముల చట్టం చేశారని తెలిపారు. అసైన్డ్ భూములు అమ్మొద్దు.. విక్రయించొద్దు.. లీజ్‌కి ఇవ్వొద్దు.. పేరు మార్చొద్దు.. నిర్మాణాలు చేపట్టొద్దనే నిబంధనలు తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. 1977 చట్టం వల్ల అసైన్డ్‌భూముల పట్టా పొందిన ఓనర్స్ అసైన్డ్ భూమి మీద హక్కు కోల్పోయారన్నారు. నీటి ప్రాజెక్టు కోసం పేద రైతుల నుంచి తీసుకున్న భూములకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. కొంత మంది కోల్పోయిన అసైన్డ్ భూములను తిరిగి వారికి అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు వింగి రాములు, సలహాదారుడు సుదర్శన్ బాబు, ఉప్పరి శ్రీనివాస్, శంకర్, విజయ్‌బాబు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

ప్రత్యేక పాఠ్యాంశాల్లో రాజ్యాంగాన్ని చేర్చాలి

ధర్నాచౌక్‌లో రాజ్యాంగ పాఠ్యాంశ దీక్ష

కవాడిగూడ: తెలంగాణ ప్రభుత్వం భారత రాజ్యాంగం పట్ల ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం జైభీం మహాసేన, తెలంగాణ సామాజిక ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద తెలంగాణ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రత్యేక సబ్జెక్టులుగా పాఠ్యాంశాలలో చేర్చాలని ధర్నాచౌక్‌లో భారత రాజ్యాంగ పాఠ్యాంశ దీక్ష చేపట్టారు. జైభీం మహాసేన వ్యవ అధ్యక్షుడు అంజన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి డా. భరత్‌భూషణ్, కాంగ్రెస్ పార్టీ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ డా. వినయ్‌కుమార్ ప్రజాకవి జయరాజ్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య హాజరై మాట్లాడారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పాలకులు నేటి వరకు భారత రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా భారత దేశంలో మాత్రమే కుల వివక్ష ఉందన్నారు. దాని వల్లే ప్రపంచ దేశాలతో పోటీ పడలేక పోతున్నామని పేర్కొన్నారు. కేంద్రం రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేస్తూ ప్రభుత్వ రంగ సెక్టార్లను కుదించి దళిత, బహుజన వర్గాలకు ఉద్యోగావకాశాలు లేకుండా కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు.

◆ ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యంగాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీసీకే పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జిలకర శ్రీనివాస్, మూఢనమ్మకాల నిర్మూలన సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బైరి నరేష్, తెలంగాణ రాష్ట్ర కళామండలి అధ్యక్షుడు తెలంగాణ శ్యామ్, బహుజన రచయిత మత దేవందర్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ దీక్షలో అంజన్న, కవి జయరాజ్

సుధారాణికి డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ డాక్టరేట్ కళ సాకారమైందని ఓయూ సైన్స్ కాలేజీ విద్యార్థినీ కె.సుధారాణి పేర్కొంది. ఓయూ అధ్యాపకురాలు ప్రొ.రోజారాణి పర్యవేక్షణలో క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఫైటో ఎక్స్ట్రాక్ట్ ఫర్ యాంటి ఎపిలెప్సీ యాక్టివిటీ ఆఫ్ ఆకలిఫా ఇండియా అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించిన్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఓయూలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో ఇస్రో చైర్మన్ డా.నారాయణన్ చేతుల మీదుగా డాక్టరేట్ డిగ్రీని అందుకున్నట్లు తెలిపారు. తన పరిశోధనలకు సహరించిన కుటుంబ సభ్యులకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

శరత్‌బాబుకు..

ఓయూ విద్యార్థి రక్కి శరత్‌బాబు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)లో పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు. కామారెడ్డి జిల్లాకు చెందిన రక్కి దేవదాస్, భారతీ దంపతుల కుమారుడైన శరత్‌బాబు జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ పూర్తి చేశారని పేర్కొన్నారు. ఓయూ అధ్యాపకురాలు ప్రొ.రాధిక పర్యవేక్షణలో 'స్వార్మ్ ఆప్టిమైజ్డ్ రాండమ్ ఫారెస్ట్ అండ్ సీఎన్ఎన్-ఎల్ ఎస్టీమ్'తో హానీపాట్ సాంకేతికతను ఉపయోగించి నెట్‌వర్క్ భద్రతకు సమగ్ర దృక్పథం అనే అశంపై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించిన్నట్లు తెలిపారు.

కొత్త హాస్టల్ భవనానికి 'దుందుభి' నామకరణం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నేడు సీఎం రేవంత్‌రెడ్డి వస్తుండటంతో ప్రారంభంకానున్న కొత్త హాస్టల్ భవనానికి దుందుభి అని పేరుపెట్టారు. దీంతో క్యాంపస్‌లో పీజీ, పీహెచ్‌డీ విద్యార్థినీ, విద్యార్థుల హాస్టల్స్ సంఖ్య సుమారు 25కు చేరుకుంది. ఇవి కాకుండా సికింద్రాబాద్ పీజీ కాలేజీ, నిజాం కాలేజీ, సైఫాబాద్ పీజీ కాలేజీలతో పాటు జిల్లా పీజీ సెంటర్లలో విద్యార్థుల వసతి కోసం మొత్తం 30 హాస్టల్స్ ఉన్నట్లు సమాచారం.

ఓయూలో స్వాగత తోరణాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా విద్యార్థి నాయకులు, టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ క్యాంపస్ అంతట స్వాగత తోరణాలతో ముంచెత్తారు. 108 ఏళ్ల చరిత్ర గల ఓయూకు సీఎం రావడాన్ని స్వాగతిస్తున్నామని మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్‌రావు పేర్కొన్నారు. ఓయూకు రూ.1000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాకను అడ్డుకుంటే సహించేదిలేదని ఓయూ జేఏసీ అధ్యక్షులు నాగరాజుగౌడ్ పేర్కొన్నారు.

నేతల ముందస్తు అరెస్టు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు సీఎం రేవంత్‌రెడ్డి రాకను అడ్డుకుంటామని బీఆర్‌ఎస్‌వీ నాయకులు ప్రకటించడంతో పలువురు విద్యార్థి నేతలను పోలీసులు ఆదివారం నుంచే ముందస్తుగా అరెస్ట్ చేశారు. యూనివర్సిటీ లైబ్రరీలో ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, డీఎస్సీ, ఇతర ఉద్యోగాలను భర్తీ చేయాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు నాగారం ప్రశాంత్ విద్యార్థులతో లేఖ రాయిస్తుండగా పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. ప్రశాంత్‌తో పాటు వేల్పుకొండ రామకృష్ణ, సంతోష్‌లను అరెస్ట్ చేసి నల్లకుంట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ దివంగత సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని ఆదివారం మగ్ధూం భవనంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ సందర్శించి నివాళులర్పించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి



కాచిగూడలో జరిగిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ నేత కైరంకొండ శ్రీకాంత్

కాచిగూడ: ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సీనియర్ కాంగ్రెస్ నేత కైరంకొండ శ్రీకాంత్ అన్నారు. యూనివర్సల్ బ్రదర్‌హుడ్ డే సందర్భంగా బ్రహ్మకుమారీస్ సోషల్ సర్వీస్ వింగ్ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని పరమాత్మ అనుభూతి ధామ్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సందర్శించిన ఆయన ఆయన మాట్లాడుతూ... ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడమే కాకుండా తోటి వారిని కూడా రక్తదానం చేసే విధంగా ప్రోత్సహించాలని కోరారు. రక్తదానంపై ఉన్న అపోహలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ శిబిరంలో 40మందికి పైగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజయోగిని దీదీ ప్రకాష్ మణిజీ, ప్రశాంతి దీది, అఖిల దీది, రూపా దీది, సుధ మహేన్, కమలాకర్ బాయి, మధుకర్ బాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవా కేంద్రాలుగా స్వచ్ఛంద సంస్థలు

ముషీరాబాద్: స్వచ్ఛంద సంస్థలు ప్రజా సేవా కేంద్రాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం దాయర మార్కెట్ సమీపంలో బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ పర్వేజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సేవా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు మానవతా దృక్పథంతో పేదలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యాలయంలో ఉచితంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆన్‌లైన్ సేవలు, వివిధ రకాల ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యాలయం దోహదపడాలన్నారు. సమస్యలను తమకు తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎడ్ల హరిబాబు యాదవ్, ముఠా జైసింహ, వై.శ్రీనివాస్‌రావు, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, మహ్మద్ ఆలీ, వాహిద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్‌లో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

నిరుపేద విద్యార్థినికి రూ.83 వేల ఆర్థిక సాయం




విద్యార్థిని తల్లి కళ్యాణికి చెక్కును అందజేస్తున్న పోచంపల్లి రమణారావు

నల్లకుంట: నిరుపేద కుటుంబానికి చెందిన వాడాల ఉదయశ్రీ అనే బ్రాహ్మణ విద్యార్థిని నగరంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. ప్రతిభావంతురాలైన ఆమె కళాశాల వార్షిక ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న శ్రీ వైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చింది. ఈ క్రమంలో కళాశాలకు చెల్లించాల్సిన ఫీజుకు సంబంధించిన రూ.83వేల చెక్కును ఆదివారం ట్రస్ట్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు విద్యార్థిని తల్లి వాడాల కళ్యాణికి అందజేసి మాట్లాడారు. ప్రతిభావంతులైన ఎందరో బ్రాహ్మణ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. అలాంటి విద్యార్థులకు చేయూతను అందించేందుకు చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి దేవులపల్లి రంగారావు, డి. అశోక్‌కుమార్, రమాకుమార్, మంత్రి లీలాభాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలి

చిక్కడపల్లి: విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ కోరారు. డివిజన్‌లోని మాల బస్తీలో ఏర్పాటు చేసిన బంచ్ కేబుల్, విద్యుత్ స్తంభాన్ని కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆయన పరిశీలించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సంపత్‌కుమార్, ఏఈ సంతోష్, నాయకులు మదన్మోహన్, గోపి, అరుణ్‌కుమార్, రాహుల్, సాయితేజ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దివ్య రచన 'నిను ప్రార్థన చేసెద' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి: ఆధ్యాత్మిక భావజాల వ్యాప్తికి ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ చేస్తున్న కృషి అభినందనీయమని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఆదివారం జ్ఞానసరస్వతి దేవాలయం సమర్పణలో త్యాగరాయ గానసభ వినాయక నవరాత్రులను పురస్కరించుకొని ప్రముఖ రచయిత పురాణ పండ శ్రీనివాస్ రచించిన 'దివ్య రచన నిను ప్రార్థన చేసెద'గ్రంథాన్ని ఆయన ముఖ్యఅతిథిగా ఆవిష్కరించి మాట్లాడారు. జంట నగరాలతో పాటు రాష్ట్రంలోని మఠాలు ఆలయాలు ధార్మిక మండళ్లలో శ్రీనివాస్ అపురూప గ్రంథాలను అందిస్తున్నారు. తొలి ప్రతిని స్వీకరించిన పూర్వ న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడారు. ఈ గ్రంథం ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళ జనార్ధనామూర్తి, బీజేపీ నాయకులు ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.